సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



ఓవరాల్ చాంపియన్ కల్వకుర్తి

అండర్– 14 క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా కల్వకుర్తి నిలిచింది.

వివరాలు 8లో ▸



హోరాహోరీగా ఖోఖో పోటీలు

రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా జూనియర్ ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.6 /19.4

ఉదయం నుంచి ఎండ ప్రభావం ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చిరుజల్లులు కురవవచ్చు.

న్యూస్‌రీల్

డబుల్‌బెడ్రూం ఇళ్లను అప్పగించండి



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో లక్కీడిప్ ద్వారా కేటాయించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అప్పటి అధికారులు డబుల్‌బెడ్రూం ఇళ్లను పేదలకు కేటాయించారని తెలిపారు. ఏడాదిన్నర కాలంగా పేదలు ఇళ్ల కోసం వేచి చూస్తున్నారని చెప్పారు. తక్షణమే జోక్యం చేసుకుని పేదలకు ఇళ్లు అప్పగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామాంజనేయులు, శ్రీనివాసులు, త్యాగరాజు, నాగరాజు, మహేష్, శ్రీమన్నారాయణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు

గద్వాల: తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేసినట్లు తెలిపారు. నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్‌లో అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటూ, కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఓ వీరభద్రప్ప ఉన్నారు.

డీఎంహెచ్‌ఓల నియామకం

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో ఇద్దరు డీఎంహెచ్‌ఓలను బదిలీ చేయగా.. మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలను పొడిగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారి స్థానంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓలను నియమించింది. మహబూబ్‌నగర్ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డా.పద్మను మూడునెలల వ్యవధిలోనే బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఆదిలాబాద్ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డా.కృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గతంలో ఆయన మహబూబ్‌నగర్ డీఎంహెచ్‌ఓగా పనిచేశారు. ఇక జోగుళాంబ గద్వాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా ఎస్‌కే సిద్దప్పను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి డీఎంహెచ్‌ఓ చంద్రమోహన్ స్థానంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా ఎ.శ్రీనివాసులును నియమించారు. చంద్రమోహన్‌కు పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది.

టపాసుల ధరలు పేలుతున్నాయ్!

తారాజువ్వల ధరలు ఆకాశానంటుతున్నాయి. చిచ్చుబుడ్లు చెట్టెక్కి కూచున్నాయి. కాకరపువ్వొత్తులు చుక్కలు చూపిస్తున్నాయి. మతాబులు చూస్తేనే మండిపోతున్నాయి.. అయినా ఏడాదికోసారి వచ్చే పండుగ కోసం.. ఇంట్లో పిల్లల ఆనందం కోసం.. ఎంతో కొంత వెచ్చించక తప్పదు. ఆ కారణంగానే దుకాణాలకు వెళ్లే వినియోగదారులపై ధరల మోత మోగుతోంది. అసలే అమ్మకాలు లేక సతమతమవుతున్న వ్యాపారులు ఇదే అదనుగా వచ్చిన వారికే అధిక ధరలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

– గద్వాల టౌన్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)

ఉమ్మడి జిల్లాలో అనుమతులు పొందిన టపాసుల దుకాణాలు

జిల్లా	దుకాణాలు
మహబూబ్‌నగర్	77
నారాయణపేట	46
వనపర్తి	38
నాగర్‌కర్నూల్	70
జోగుళాంబ గద్వాల	33



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టపాసులు కొనుగోలు చేస్తున్న జనం

- గతేడాదితో పోలిస్తే 20 నుంచి 30 శాతం మేర పెరుగుదల
- విక్రయాలు బాగా పడిపోయాయంటున్న వ్యాపారులు

దీపావళికి ఒక్కరోజు మిగిలి ఉంది. గతేడాదితో పోలిస్తే బాణాసంచా ధరలు ఈసారి పేలిపోతున్నాయి. ఏకంగా 20 నుంచి 30 శాతం మేర ధరలు పెంచారు. దీంతో సాధారణ, మధ్య తరగతి వర్గాల ప్రజలు టపాసులు కొనుగోళ్లు తగ్గించారు. ప్రస్తుతం కాకరపువ్వొత్తులు సైజును బట్టి బాక్స్ రూ.40 నుంచి రూ.150, చిచ్చుబుడ్ల బాక్స్ రూ.200 నుంచి రూ.1,000, 1000 వాలా రూ.600 నుంచి రూ.800, 5,000 వాలా రూ.3,000 నుంచి రూ.3,500 వరకు, లక్ష్మీబాంబుల బాక్స్ 300 నుంచి రూ.350, భూ చక్రాల బాక్స్ రూ.120 నుంచి రూ.180, తాళ్లబాక్స్ రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు.

15–10 రెట్లు అధికంగా ఎమ్మార్పీ

అతడు కొనుగోలు చేసిన టపాసుల బాక్స్‌లపై ఉన్న గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) లెక్కిస్తే మొత్తం రూ.5 వేల వరకు ఉంది. అంటే ఆ వ్యాపారి రూ.3,900 మేర తగ్గించినట్లు పైకి కనిపిస్తోంది. కానీ ఇదంతా మాయాజాలం. బాణసంచా వాస్తవ ధరకు, దానిపై ముద్రించే ఎమ్మార్పీకి ఎక్కడా పొంతన ఉండదు. ప్రతి వస్తువుపై అసలు ధర కన్నా 15–10 రెట్లు అధికంగా ఎమ్మార్పీని ముద్రిస్తున్నారు. అన్నివర్గాల ప్రజలు ఉత్సాహంగా జరుపుకొనే పండుగ దీపావళి. టపాసులు కాలుస్తున్నప్పుడు పిల్లల ఆనందానికి అవధులు ఉండవు. అందుకే తమ ఆర్థిక స్థోమతను బట్టి పిల్లల ఆనందం కోసం ఎంత ఖరీదైనా తల్లిదండ్రులు బాణసంచా కొనుగోలు చేస్తారు. గతంతో పోలిస్తే ఈసారి వీటి ధరలు 20– 30 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులే చెబుతున్నారు. గతంతో పోలిస్తే విక్రయాలు కూడా భారీగా పడిపోయాయని, ఎంత వ్యాపారం చేసినా ఈ రెండురోజులే అని పేర్కొంటున్నారు.

దీపావళికి ముందే టపాసుల ధరల మోతతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బాణసంచా ధరలను పరిశీలిస్తే వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నట్లు స్పష్టమవుతోంది. ప్రతి టపాసుల బాక్స్‌పై ఉండే గరిష్ట ధరకు ఐదారు రెట్లు తగ్గించి వ్యాపారులు వినియోగదారుడికి విక్రయిస్తుంటారు. అసలు ఇంత భారీగా గరిష్ట ధరలు ముద్రించాల్సిన అవసరం ఏముందని

తయారీ పరిశ్రమల పోటీ కారణంగా

వ్యాపార వర్గాలను ఆరా తీయగా బాణసంచా తయారీ పరిశ్రమలు పోటీ కారణంగా ఇలా భారీగా ఎమ్మార్పీలు ముద్రించి వాటి కంటే అతి తక్కువకు విక్రయాలు సాగిస్తుంటాయని చెబుతున్నారు. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే భారీగా జరిగే వ్యాపారం కావడంతో దీనిపై ఎవరూ పెద్దగా దృష్టిసారించడం లేదని పేర్కొంటున్నారు. దీంతోపాటు కొందరు అధికారులు, సిబ్బందికి మామూళ్లతో పాటు బాణసంచా సైతం ముట్టజెప్పాల్సి ఉంటుందని వ్యాపారులు తెలిపారు. వీటన్నింటినీ చూసుకొని బాణసంచా విక్రయించాల్సి వస్తుందని చెబుతున్నారు.

ధరలు చూస్తే భయమేస్తుంది..



మధ్య తరగతి, సామాన్య ప్రజలు టపాసులు కొనలేని పరిస్థితి ఉంది. ప్రతి ఏడాది ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఆ ధరలను చూస్తే భయం వేస్తుంది. గతంలో రూ.వందల్లో పెట్టి కొంటే వచ్చే టపాసులు ఇప్పుడు రూ.వేలు పెట్టి కొన్నా రావడం లేదు. టపాసుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మంజుల, గృహిణి, మహబూబ్‌నగర్

పండగ భారంగా మారింది..



నిత్యావసరాలతోపాటు టపాసుల ధరలు విపరీతంగా పెరగడంతో దీపావళి పండగ భారంగా మారింది. పిల్లల సంతోషం కోసం టపాసులు కొనుగోలు చేయక తప్పడం లేదు. మార్కెట్‌లో ధరల నియంత్రణపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– మమత, కొత్తూరు గ్రామం, మిడ్జిల్

కొన్ని మాత్రమే కొన్నాం..



గతేడాది కంటే ఈసారి పటాకులకు అధిక ధరలు చెప్తున్నారు. ఇంతకు ముందు రూ.వెయ్యికే 15 నుంచి 20 రకాల పటాకులు కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు 10 రకాల బాణాసంచా కూడా వచ్చే పరిస్థితి లేదు. అధిక ధరల కారణంగా కొన్ని పటాకులనే కొనుగోలు చేశాం.

– సి.భారతి, గోపన్‌పల్లి, దేవరకద్ర

సామాన్యులు కొనలేరు..



గతేడాదితో పోల్చితే ఈసారి ఏకంగా 20 శాతం ఎక్కువగా టపాసుల ధరలు ఉన్నాయి. పిల్లల సంతోషం కోసం తప్పనిసరి కొనాల్సి వస్తుంది.

– శాంతకుమార్, వీరన్నపేట, మహబూబ్‌నగర్

పకడ్బందీగా ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ఇంటింటి సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర సర్వే ప్రక్రియను వచ్చేనెల 6నుంచి 18వ తేదీ వరకు చేపట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఎన్యుమరేటర్లు 1నుంచి 3వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్వేలో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం..

వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ బీఎం సంతోష్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల ధరూరు మండలం ఉప్పేరు పీహెచ్‌సీలో మాతృమరణం చోటుచేసుకోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వైద్యుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదన్నారు. గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డా. సిద్దప్ప ఉన్నారు.

గద్వాల పురపాలికలో డ్రోన్ సర్వే..

గద్వాల మున్సిపాలిటీలో డ్రోన్ సర్వే చేసి, సమస్యల పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో డీటీసీపీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రోన్‌కు మున్సిపల్ చైర్మన్ కేశవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా జీఐఎస్ ఆధారిత ప్రణాళిక కోసం ఎంపికైన రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీల్లో గద్వాల కూడా ఉన్నట్లు తెలిపారు. డ్రోన్ సర్వే ద్వారా సేకరించిన ఖచ్చితమైన మ్యాప్‌తో భవనాలు, రహదారులు, నీటివనరులు, పార్కులు, డ్రెయినేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతుల స్థితిని పరిశీలించి.. వాటి నిర్వాహణ, అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీసీపీ అదనపు డైరెక్టర్ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు..

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారిపై మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. కల్వర్టులు, మలుపులు, ఎత్తు పల్లాలు ఉన్న ప్రాంతాల్లో వాహనదారులు గుర్తించేలా వేగ నిరోధక ఏర్పాట్లతో పాటు ప్రత్యేక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి, పీఆర్ ఈఈ దామోదర్‌రావు ఉన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి కవితాదేవి

గద్వాలటౌన్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలపై ఉండే వివక్షత, హింస, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. బాలికలు స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ఆడపిల్లల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువచ్చాయని.. వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయని వివరించారు. బాల్యవివాహాలు, ఆడపిల్లల విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల పెళ్లికి అండగా సర్కార్

గద్వాల/ కేటీదొడ్డి: పేదింటి ఆడబిడ్డల పెళ్లికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కేటీదొడ్డి మండలానికి చెందిన 204 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేసే విధంగా కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో గద్వాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హనుమంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జంబు రామన్‌గౌడు, రాజశేఖర్, రామకృష్ణనాయుడు, ఉరుకుందు, గోవిందు, నసీర్, తిక్కన్న పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

హామీల అమలుపై ప్రశ్నిస్తే బెదిరింపులా?

- పంట రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు
- జీఓనంబర్ 29తో విద్యార్థులు, నిరుద్యోగులు సమస్యల్లోకి..
- బీఆర్‌ఎస్ పాలనలోనే పెరిగిన సాగు విస్తీర్ణం
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



మాట్లాడుతున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

వనపర్తి: ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రతిపక్ష హోదాలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సామాజిక మాధ్యమ వేదికగా ప్రశ్నిస్తే పోలీసు కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది కావస్తున్నా.. అర్హులైన చాలామంది రైతులు నేటికీ పంట రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మంగళవారం రైతాంగ నిరసన సదస్సులో పాల్గొనేందుకు జిల్లా కేంద్రానికి వచ్చి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి అంబేడ్కర్ చౌరస్తాలో డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కాలినడకన వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం వేలాదిగా తరలి వచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాల్లో పేర్లలో తప్పులున్నాయంటూ సవాలక్ష కొర్రీలు పెట్టి వేలాది మంది రైతులకు రుణమాఫీ ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో ఎన్నో కేసులు చూశామని.. నాయకులు, కార్యకర్తలు భయపడరని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు చిత్తవుతుంటే.. ఎందుకు బోనస్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని.. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. జీఓనంబర్ 29 అమలుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు, నిరుద్యోగులు అన్యాయానికి గురయ్యారని.. ప్రజాపాలన అంటూ శోకంలో ముంచెత్తారని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానాలను మందుల కొరత తీవ్రంగా వేధిస్తోందని.. కంపెనీలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరాకు బ్రేక్ పడిందని చెప్పారు. పలువురు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని.. వారి పేర్లను డైరీలో రాసుకొని అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో వనపర్తి జిల్లాలో కేవలం పదివేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందేదని.. నాడు నీటిపారుదలశాఖ మంత్రిగా బుద్దారం బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన 40 రోజుల్లో పనులు పూర్తి చేయించిన చిత్తశుద్ధిగల నాయకుడు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేశారని తెలిపారు.

హామీలు అమలు చేయని దుస్థితి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎన్నోరకాల ప్రయోజనాలు కల్పించే ప్రయత్నం చేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేర్చని దుస్థితికి చేరుకుందన్నారు. రైతుబంధు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతూనే.. రూ.కోట్లు వెచ్చించి మూసినది ప్రక్షాళన ఎలా చేస్తారని ప్రశ్నించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం ఎన్నోసార్లు జైలుకు వెళ్లిన వారే ఎక్కు వ మంది బీఆర్‌ఎస్‌లో ఉన్నారని, పోలీసు కేసులకు ఉద్యమ నాయకులు భయపడరని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని, దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైతాంగ నిరసన సదస్సుకు హాజరైన హరీష్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బాలరాజు, అంజయ్య, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజని, దేశపతి శ్రీనివాస్ తదితరులు

అయోధ్య రామయంత్రం రథానికి ఘన స్వాగతం



జోగుళాంబ శక్తిపీఠం/ఎర్రవల్లి: అయోధ్యలో ప్రతిష్ఠించనున్న శ్రీరామయంత్రం మంగళవారం అలంపూర్ జోగుళాంబ క్షేత్రానికి చేరుకుంది. శ్రీరామయంత్రం రథానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, స్థానిక ఆర్యవైశ్య భక్తులు ఘన స్వాగతం పలికారు. కంచీ పీఠం నుంచి అయోధ్యకు తరలిస్తున్న ఐదు శతాబ్దాల క్రితం నాటి శ్రీరామ యంత్రానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీచుపల్లి పుణ్యక్షేత్రానికి శ్రీరామయంత్రం చేరుకోగా.. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీచారి బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, జగదీష్‌రెడ్డి, మల్లేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల దిగువ, ఎగువ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. మంగళవారం 9 యూనిట్ల నుంచి ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ 4 యూనిట్ల నుంచి 156 మెగావాట్లు, 324.716 మి.యూ., దిగువ 5 యూనిట్ల నుంచి 200 మెగావాట్లు, 309.255 మి.యూ. ఉత్పత్తి చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 633.971 మి.యూ. విద్యుదుత్పత్తి సాధించామని.. ఇందుకు 31 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళాశక్తి పథకం లబ్ధిదారు ఏర్పాటు చేసుకున్న శారీ సెంటర్‌ను పరిశీలిస్తున్న రష్మితారెడ్డి

గద్వాలన్యూటౌన్: స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మెప్మా రాష్ట్ర మిషన్ కోఆర్డినేటర్ రష్మితారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో మహిళాశక్తి పథకం కింద నిర్వహిస్తున్న వివిధ రకాల వ్యాపార యూనిట్లను మంగళవారం పరిశీలించారు. టైలరింగ్, శారీ సెంటర్, బ్యూటీ పార్లర్, మినీ సూపర్ మార్కెట్, కర్రీ పాయింట్లను ఆమె చూశారు. వ్యాపార లావాదేవీల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా రుణపరిమితి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీకర్, శిరీష, నిజాముద్దీన్, మహాలక్ష్మి, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా అడుగులు



రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా మంగళవారం మాన్‌దొడ్డి గ్రామంలో పెద్ద ధన్వాడ, చిన్నధన్వాడ, మాన్‌దొడ్డి, నసనూరు గ్రామాల ప్రజలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం రాజోళికి చేరుకొని తహసీల్దార్ రామ్మోహన్, ఎస్‌ఐ జగదీష్‌లను వేర్వేరుగా కలిసి ఇథనాల్ కంపెనీపై వ్యతిరేకతను వ్యక్తపరిచారు. ఇథనాల్ కంపెనీతో ఆరోగ్య సంబంధిత వ్యాధులు రావడంతో పాటు పంట పొలాలు దెబ్బతింటాయని.. పిల్లల భవిష్యత్ అంధకారంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ ఏర్పాటును అడ్డుకుంటామని.. సహకరించాలని కోరారు. కాగా, శాంతియుత వాతావరణంలో సమస్యను పరిష్కరించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు అధికారులు సూచించారు.

వేరుశనగ @ రూ. 5,531

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ. 5,531, కనిష్టంగా రూ. 2,529, సగటున రూ. 4,140 ధరలు పలికాయి. మార్కెట్‌కు 1,044 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. అదేవిధంగా 137 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్టంగా రూ. 5,821, కనిష్టంగా రూ. 3,201, సగటున రూ. 5,815 ధరలు వచ్చాయి. 29 క్వింటాళ్ల వరి (సోన) రాగా.. గరిష్టంగా రూ. 2,236, కనిష్టంగా రూ. 2,108, సగటున రూ. 2,119 ధరలు లభించాయి.

క్లుప్తంగా

పోలీసు కానిస్టేబుల్‌పై దాడి

● ముగ్గురిపై కేసు నమోదు

కోస్గి: విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి, దాడికి పాల్పడిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లాలో ప్రత్యేక విధులు నిర్వహించే పోలీసు కానిస్టేబుల్ కోస్గిలో నివాసముంటున్నారు. బొంరాస్‌పేట మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీ విషయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తుంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి విధి నిర్వహణలో ఉన్న సదరు పోలీస్ కానిస్టేబుల్ రోడ్డు పక్కన బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతుండగా.. కోస్గి మండలం సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన వెంకటయ్య, చంద్రయ్యతో పాటు మరో వ్యక్తి వెంకటయ్య కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించారు. తాను పోలీసునని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా దాడికి పాల్పడ్డారు. ఏకంగా కానిస్టేబుల్ బైక్ లాక్కొని దుర్భాషలాడారు. ఈ ఘటనపై బాధిత కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

● తెల్లరాళ్లపల్లి తండాలో విషాదం



వపన్ నాయక్ (ఫైల్)

పాన్‌గల్: హైదరాబాద్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. తెల్లరాళ్లపల్లికి తండాకు చెందిన నీలమ్మ, శంకర్‌నాయక్‌ల ఏకైక కుమారుడు పవన్ నాయక్ (22) హైదరాబాద్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి స్నేహితుల వద్దకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా.. ఇబ్రహీంపట్నం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఒక్కగానొక కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా రోదించారు. విద్యార్థి మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెరువులో వ్యక్తి గల్లంతు

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తు తెలియని వ్యక్తి చెరువులో గల్లంతైన సంఘటన జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి కేసరి సముద్రం చెరువులోని బతుకమ్మ ఘాట్‌లో మునిగిపోతుండగా, అక్కడే చేపలు పడుతున్న వ్యక్తులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించారు. ఆలోపే ఆ వ్యక్తి నీటిలో మునిగిపోయాడు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వెతికినా మృతదేహం లభ్యం కాలేదు. దీంతో రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపేశారు. గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయాడా? ఆత్మహత్య చేసుకునేందుకు నీటిలోకి వెళ్లాడా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

● విద్యార్థులకు తప్పిన ప్రాణాపాయం



కాల్వలోకి దూసుకువెళ్లిన స్కూల్ బస్సు

లింగాల: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన ఘటన రాయవరం – కొత్తచెరువు తండా మార్గంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాఠశాల సమయం పూర్తయిన తర్వాత ధారారం, క్యాంపు రాయవరం, రాయవరం, కొత్తచెరువు తండాలకు చెందిన విద్యార్థులు స్కూల్ బస్సులో బయల్దేరారు. చివరగా కొత్తచెరువు తండాకు చెందిన విద్యార్థులను దింపేందుకు వెళ్తుండగా.. బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కేఎల్ఐ కాల్వలోకి దూసుకెళ్లింది. తండాకు చెందిన కొందరు విద్యార్థులు ప్రాణాపాయ స్థితి నుంచి క్షేమంగా బయటపడ్డారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు కండీషన్ విషయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2న ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని స్టేడియంలో వచ్చేనెల 2వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 విభాగాల బాలబాలికల నెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఒరిజినల్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం రాంమోహన్‌గౌడ్ 9985979007 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓవరాల్ చాంపియన్ కల్వకుర్తి



అండర్- 14 విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న కల్వకుర్తి జట్టు

● ముగిసిన అండర్- 14, 19 ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు
● గెలుపోటములను సమానంగా స్వీకరించాలి : బీసీ గురుకులాల అధికారి వెంకట్‌రెడ్డి

కల్వకుర్తి టౌన్: ఉమ్మడి జిల్లా అండర్- 14, 19 క్రీడా పోటీల్లో అండర్- 14 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా కల్వకుర్తి గురుకుల పాఠశాల నిలిచింది. కల్వకుర్తిలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్- 14, 19 క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఖోఖో విభాగంలో కల్వకుర్తి ప్రథమ స్థానం, తాడూరు ద్వితీయ స్థానంలో నిలిచాయి. చెస్ విభాగంలో పెబ్బేరుకు చెందిన జయలలిత మొదటి స్థానంలో, వెల్దార్‌కు చెందిన జయంతి రెండో స్థానంలో నిలిచారు. అథ్లెటిక్ విభాగంలో 100, 200, 600 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్ విభాగాల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

■ అండర్- 19 విభాగం డిస్కస్‌త్రోలో కల్వకుర్తికి చెందిన కృష్ణవేణి ప్రథమ స్థానంలో, ఉప్పునుంతలకు చెందిన అర్పిత ద్వితీయ స్థానంలో, పుల్లూరుకు చెందిన ప్రణతి తృతీయ స్థానంలో నిలిచారు. అథ్లెటిక్ 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్ విభాగాల్లో ఆయా పాఠశాలల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు.

బహుమతుల అందజేత..

క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఉమ్మడి జిల్లా బీసీ గురుకులాల అధికారి (ఆర్సీఓ) వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా అండర్- 14, 19 క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురుకులాల్లో విద్యార్థుల ప్రతిభను పెంచేందుకు ఇలాంటి పోటీలను నిత్యం నిర్వహిస్తున్నామన్నారు. క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎంతో మంది విద్యార్థినిలు గొప్ప స్థాయిలో ఉన్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహించేలా పీఈటీలకు ప్రత్యేకంగా సూచనలు చేస్తూ వారికి ట్రెనింగ్ ఇవ్వాలని సూచించామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి బీసీ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ నాగమణి, పీఈటీ సింధు, 16 గురుకుల పాఠశాలల పీఈటీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పీయూలో టేబుల్ టెన్నిస్, చెస్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో టేబుల్ టెన్నిస్, చెస్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ మేరకు రెండు జట్లలో కలిపి మొత్తం 15 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వీఐటీ వేలూర్, వీల్‌టెక్ చెన్నై, గీతం యూనివర్సిటీల్లో నిర్వహించే అంతర్రాష్ట్ర యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికల్లో పీయూ కంట్రోలర్ రాజ్‌కుమార్, సత్యభాస్కర్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా సిలబస్‌లో మార్పులు



ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా సరస్వతిదేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ జీఎన్ శ్రీనివాస్, ప్రొఫెసర్ రామ్‌రెడ్డి

పొలిటికల్ సైన్స్ ఓరియంటేషన్‌లో వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధి కల్పనే లక్ష్యంగా సిలబస్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో జరిగిన పొలిటికల్ సైన్స్ ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2020 నూతన విద్యావిధానానికి అనుగుణంగా సిలబస్‌లో మార్పులు ఉండాలని, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, విద్యార్థి చదువు పూర్తి చేసిన వెంటనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా కరిక్యులమ్‌లో మార్పులు చేయాలన్నారు. వాటితో పాటు సమాజంలో విద్యార్థులు ఎలా మెలగాలి, మహిళలను ఏ విధంగా గౌరవించాలో నేర్పించాలన్నారు. ఏపీ కేంద్రియ విద్యాలయ ప్రొఫెసర్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ బోధన అనేక ఏకపాత్రాభినయం కాదని, ద్విపాత్రాభినంగా ఉంటుందన్నారు. రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనించి విద్యార్థులకు బోధించాలన్నారు. కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు భూమయ్య, కన్వీనర్ కుమారస్వామి, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రకిరణ్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నూర్జహాన్, విజయ్‌భాస్కర్, సోమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకే గ్రామంలో ముగ్గురికి జూ.లెక్చరర్ ఉద్యోగాలు



రాములు హిమబిందు భరత్

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు చెందిన ముగ్గురు జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. లక్ష్మయ్య – మంగమ్మల కుమారుడు రాములు కెమిస్ట్రీ లెక్చరర్‌గా, శ్రీనివాసులు – అనురాధ కుమారుడు భరత్ హిస్టరీ లెక్చరర్‌గా, సలేశ్వరం సతీమణి హిమబిందు కామర్స్ విభాగంలో లెక్చరర్‌గా ఎంపికయ్యారు. పేదరికంలో పుట్టి పెరిగిన వీరు.. జేఎల్ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

పీయూలో కృత్రిమమేధా కోర్సులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త దేవన్గిరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్

వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో త్వరలో కృత్రిమేధా కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వీసీ జీఎన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో టీజీ కాస్ట్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో కృత్రిమేధా ఎంతో కీలకంగా మారనుందని, అందుకే ఆ కోర్సును తీసుకొస్తామన్నారు. సైన్స్ సబ్జెక్టులకు అన్నింటికి మూలం గణితమేనని, దాని విశ్లేషణ లేకుండా రీసెర్చ్ మనగడ లేదన్నారు. కర్ణాటక దేవన్గిరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పీజీ స్థాయిలో విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు బోధన రంగంలోనే కాకుండా పారిశ్రామిక రంగంలో కూడా అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు గణితం అంటే భయపడే పరిస్థితి ఉందని, కొంత శ్రమపడితే గణితంతో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. లేటెస్కా, మ్యాథమెటికా, మాథమాటి, ల్యాబ్స్ ఫోనిక్స్ వంటి సాఫ్ట్‌వేర్‌ల ద్వారా వివిధ అంశాలపై లోతైన పరిశోధనలు జరుగుతున్నాయని, సాఫ్ట్‌వేర్‌ల వినియోగంపై పీయూ విద్యార్థులకు ఉచితంగా ఒక్క వారంపాటు అవగాహన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, చంద్రకిరణ్, రవీందర్‌రెడ్డి, కో కన్వీనర్ మధు, నాగరాజు, సురేష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న బాలుడు

● రెండు తులాల బంగారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత



సాయికుమార్‌ను సన్మానిస్తున్న సీఐ మహేష్, ఎస్ఐ సతీష్

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పిల్ల చంద్రమ్మ ఈ నెల 28న తన బిడ్డ దగ్గరకు కల్వకోల్ వెళ్లింది. రెండు తులాల మూడు మాసాల బంగారం నానును పోగొట్టుకున్నది. మంగళవారం కల్వకోల్ గ్రామానికి చెందిన చెంసెట్టి సాయికుమార్‌కు బంగారం నాను దొరికింది. ఆ బంగారంను నిజాయితీతో తన తండ్రి సత్యంతో వెళ్లి పెద్దకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. సాయికుమార్ నిజాయితీని మెచ్చుకున్న కొల్లాపూర్ సీఐ మహేష్ శాల్వా, కొత్త బట్టలు, బూట్లు ఇప్పించి బాలుడిని సన్మానించారు. కార్యక్రమంలో దేవల్‌తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ సత్యం ఉన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

యువకుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని నిరుద్యోగులతో డబ్బులు వసూలు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుల కథనం మేరకు... గద్వాల మండలం వెంకంపేట గ్రామానికి చెందిన యువరాజు వైద్యశాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని 8 నెలల క్రితం అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు మల్లెపోగు అశోక్ కుమార్‌ను నమ్మించాడు. అతడి మాయమాటలు నమ్మిన సదరు నిరుద్యోగి రూ. 2.50 లక్షల నగదు అందజేశారు. ఈ క్రమంలో ఆరు నెలలు తర్వాత పోస్టింగ్ ఆర్డర్ కాపీ వస్తుందని నమ్మబలికాడు. 8 నెలలు పూర్తయినప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో బాధితుడు గట్టిగా నిలదీయగా.. నేడు, రేపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సోమవారం స్థానిక రూరల్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కాగా, అదే గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ సైతం ఉద్యోగం కోసం రూ. 58 వేల నగదు యువరాజ్‌కు అందజేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హోంవర్క్ చేయలేదని.. విద్యార్థిపై ఉపాధ్యాయుడి ప్రతాపం



విద్యార్థి నిఖిల్ వీపుపై ఏర్పడిన వాతలు

జడ్చర్ల టౌన్: హోంవర్క్ చేయలేదనే నెపంతో ఓ ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడు విద్యార్థిపై ప్రతాపం చూపిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. జడ్చర్ల మండలం పోలేపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిఖిల్ అనే విద్యార్థి 2వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లగా.. హోంవర్క్ చేయలేదనే కారణంతో సదరు ఉపాధ్యాయుడు నిఖిల్ వీపుపై బాదాడు. మంగళవారం ఉదయం స్నానం చేస్తున్న సమయంలో వీపుపై ఎర్రటి వాతలు ఉండటాన్ని గమనించిన తల్లి.. విద్యార్థిని ప్రశ్నించగా ఉపాధ్యాయుడు కొట్టినట్లు తెలియజేశారు. దీంతో విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎంఈఓ మంజులాదేవి తెలియజేశారు. ఇదే పాఠశాలలో రెండు నెలల క్రితం ఓ విద్యార్థిని చితకబాదిన ఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడంతో పోలేపల్లి గ్రామం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

పోక్సో కేసులో నిందితుడికి తొమ్మిదేళ్ల జైలుశిక్ష

ఊట్కూర్: బాలికపై లైంగిక దాడికి పాల్పడి.. ఆత్మహత్యకు కారణమైన నిందితుడికి తొమ్మిదేళ్ల నాలుగు నెలల జైలుశిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎండీ రఫీ తీర్పు ఇచ్చారని ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన బాల్‌రాజ్ (20) ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసే వాడు. ఈ క్రమంలో 2020 ఆగస్టు 25న బాలికను బలవంతంగా గ్రామ శివారులోని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక అదే రోజు పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నారాయణపేట ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు 2020 ఆగస్టు 26న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ శంకర్ నేతృత్వంలో విచారణ నిర్వహించారు. జిల్లా కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో బాల్‌రాజ్‌కు తొమ్మిదేళ్ల నాలుగు నెలల జైలుశిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు



ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఖోఖో మ్యాచ్‌లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో 43వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా జూనియర్ ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు పోటీలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు క్రీడా జట్లను పరిచయం చేసుకొని అభినందించారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు ఎమ్మెల్యే, చైర్మన్లను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి జీఏ.విలియం, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.బాల్‌రాజు, టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, రిటైర్డ్ పీడీ యా.శ్రీనివాసులు, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, జిల్లా ఎస్ఎస్‌యూఐ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్ పాల్గొన్నారు.

రెండో రోజు ఫలితాలు

బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు 36–24 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టుపై, మెదక్ జట్టు 28–24 తేడాతో కరీంనగర్‌పై, వరంగల్ జట్టు 30–20 పాయింట్ల తేడాతో నల్లగొండపై, రంగారెడ్డి జట్టు 22–18 తేడాతో మహబూబ్‌నగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 24–14 తేడాతో హైదరాబాద్‌పై, మెదక్ జట్టు 36–30 తేడాతో నిజామాబాద్ జట్లపై గెలుపొందాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు 24–4 పాయింట్ల తేడాతో ఖమ్మంపై, మెదక్ జట్టు 14–12 తేడాతో కరీంనగర్‌పై, నల్లగొండ జట్టు 20–8 తేడా తో మహబూబ్‌నగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 36–2 తే డాతో నిజామాబాద్‌పై, రంగారెడ్డి జట్టు 24–8 తేడా తో మెదక్‌పై, మెదక్ జట్టు 36–30 పాయింట్ల తేడా తో నిజామాబాద్ జట్లపై విజయం సాధించాయి.



మహబూబ్‌నగర్ - కరీంనగర్ బాలికల మ్యాచ్

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ ఎంపికలు



బాస్కెట్‌బాల్ క్రీడాకారులతో పీడీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19, అండర్–17, అండర్–14 విభాగాల బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా విభాగాల్లో వందలాదిమంది హాజరయ్యారు. బాస్కెట్‌బాల్ క్రీడాకారులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిచయం చేసుకున్నారు. కొంతసేపు బాస్కెట్‌బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, పీడీలు వేణుగోపాల్, శైలజ, ఫారుఖ్ ముకర్రం, పీఈటీ రాకేష్, కోచ్ ఎండీ.ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సాయిలు సేవలు అభినందనీయం



బెల్లం సాయిలును సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి భక్తులకు అప్పంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బెల్లం సాయిలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి అన్నారు. 30 ఏళ్లుగా కురుమూర్తి స్వామి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సాయిలును మంగళవారం ఆలయంలో శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామి వారి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుమూర్తి స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో 1995లో బెల్లం సాయిలు తన సొంత ఖర్చుతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. 1997లో మద్దయ్యశెట్టి దాత సహకారంతో 100 మంది భక్తులకు అన్నదానం చేయించినట్లు వివరించారు. నాటి నుంచి 30 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమానికి దాతల సహకారం సమకూరుస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా బ్రహ్మోత్సవాల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుండటంతో అభినందనలు తెలిపారు.

జూరాలకు మరింత తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గింది. మంగళవారం సాయంత్రానికి 23 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. విద్యుదుత్పత్తి నిమిత్తం నుంచి 31,000 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు సమాంతర కాల్వకు 500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు మొత్తం 34,481 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.357 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 882.9 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 882.9 అడుగుల వద్ద 203.8907 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 40,384 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,600 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,064 మొత్తం 67,664 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

సిగరెట్ కాటన్లు చోరీ: దొంగలు అరెస్ట్

● రూ.21.70లక్షల నగదు స్వాధీనం

జడ్చర్ల: శ్రీ రాంనగర్‌లోని ఐటీసీ గోదాంలో ఈనెల 20న తాళాలు విరగ్గొట్టి సిగరెట్ కాటన్లను అపహరించిన దొంగలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. శ్రీరాంనగర్‌లో మణికాంత్ నిర్వహిస్తున్న ఐటీసీ గోదాంలో నిల్వ చేసిన 32 సిగరెట్ కాటన్లను దొంగలు బొలెరో వాహనంలో తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన క్రమంలో మంగళవారం 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులు బొలెరో వాహనంలో కర్నూల్ వైపు వెళ్తుండగా పట్టుబడ్డారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మానిక్‌చంద్ కుమావత్, కైలాష్ కుమావత్, గన్‌పత్ కుమావత్‌లను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు దినేష్ పరారీలో ఉన్నాడు. వారి నుంచి బొలెరోతో పాటు రూ.13.80 లక్షల నగదు, 18సిగరెట్ కాటన్లను స్వాధీనం చేసుకున్నారు. కీసర, పీఎస్ మోంగ మార్కెట్ పీఎస్‌ల పరిధిలో ఇదే తరహాలో చోరీ కేసులకు సంబంధించి రూ.7.90 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజాస్థాన్ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి సిగరెట్ హోల్‌సేల్ దుకాణాలను, కిరాణ దుకాణాలపై నిఘా వేసి చోరీలకు పాల్పడుతుంటారని సీఐ తెలిపారు.

